సాక్షి చిత్తూరు

సోమవారం । 26 । జూన్ । 2023



ఒంటరి ఏనుగు సంచారం

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లి అటవీ సరిహద్దు పొలాల్లో ఆదివారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది.

- 8లో



భూ బకాసురులపై ఉక్కుపాదం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రత్యేక బృందాలను నియమించింది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	37	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

కాణిపాకం కిటకిట



భక్తులతో నిండిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంపార్ట్‌మెంట్, క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు చేపట్టారు.

బోయకొండలో ఆషాఢం రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన శ్రీబోయకొండ గంగమ్మ తల్లి దీవెనల కోసం భక్తులు అశేషంగా తరలివచ్చారు. ఆషాఢ మాసం తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 50వేల మందిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువ జామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయాన్ని వేపాకు, మామిడి తోరణాలతో ముస్తాబుచేశారు. కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి పిండి, నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటుచేశారు.

రూ.13.56 లక్షల ఆదాయం

అమ్మవారిని ఆదివారం ఒక్కరోజే సుమారు 50 వేల మంది దర్శించుకున్నారని ఈఓ చంద్రమౌళి తెలిపారు. ఆలయంలో వివిధ సేవా టికెట్ల విక్రయాల ద్వారా రూ.13.56 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

28న జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 28న జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్పన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. 1–7 వరకు స్థాయి సంఘాల సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక, పనులు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ స్థాయి సంఘాలు, విద్య, వైద్య, మహిళా, సాంఘిక సంక్షేమశాఖ పరంగా జరుగుతున్న అభివృద్ధిపై చర్చ ఉంటుందన్నారు.

కేజీబీవీ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఎంఈఓలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) పాఠశాలల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలన పకడ్బందీగా నిర్వహించారు. ఆదివారం డీఈవో కార్యాలయంలో సీనియర్ హెచ్ఎంలు, ఎంఈవో– 2లు సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రక్రియను సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకట రమణారెడ్డి, జీసీడీవో సుజాత పర్యవేక్షించారు. ఎంఈవో– 2లు మోహన్, రమేష్, గణపతి, సిబ్బంది చైతన్య పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ కడప జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఎత్తు, బరువు, స్టాండింగ్, బ్రాడ్‌జంప్, షటిల్‌రన్, 30 మీటర్ల ఫ్లైయింగ్ రన్, 800 మీటర్ల రన్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు.

నాడు : టీడీపీ పాలనలో మొండిగోడలు, శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, ప్రహరీలు లేక పశువులు, పందులతో సహవాసం. మరుగుదొడ్లు లేక బాలికల అవస్థలు. కిచెన్ షెడ్లు లేక ఆరుబయట, వర్షంలోనే వంటలు, కొళాయిలు లేక అసలు నీరే తాగకపోవడం వంటి సమస్యలతో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు అవస్థలు ఎదుర్కొనే వారు.

నేడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేస్తున్న నాడు–నేడు పథకంతో సర్కారు బడులు కొత్త రూపు సంతరించుకున్నాయి. ప్రభుత్వం వందల కోట్లు నాడు నేడు పథకానికి ఖర్చు చేయడంతో సర్కారు బడులు సర్వాంగ సుందరంగా మారాయి. మౌలిక వసతులతో పాటు కార్పొరేట్ స్థాయిలో సర్కారు బడుల్లో విద్య అందుతోంది.



నాడు కుప్పం మండలంలోని పరమసముద్రం కేజీబీవీ పాఠశాల



నేడు కుప్పం మండలంలోని పరమసముద్రం కేజీబీవీ పాఠశాల

కార్పొరేట్ కళ..

సర్కారు బడి భళా

అక్షరం.. దీని శక్తి అనన్య సామాన్యం.. ఇది జీవితాన్ని మార్చేస్తుందని గ్రహించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నిరుపేద చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించారాయన. అందుకే ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు. ఇప్పటికే విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే నాడు–నేడు పథకం అమలు చేసి సర్కారు స్కూళ్లను ఆధునీకరించారు. ఫలితంగా వాటికి కార్పొరేట్ కళ వచ్చిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నాడు–నేడుతో సకల హంగులు
- సర్వాంగ సుందరంగా సర్కారు బడులు
- బలోపేతమైన విద్యారంగం

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ హయాంలో సర్కారు బడులను ఏమాత్రం పట్టించుకోని దుస్థితి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉన్న చిత్తూరు, తిరుపతి జిల్లాలకు దేశవ్యాప్తంగా గొప్ప పేరుంది. చంద్రబాబునాయుడు పరిపాలనలో ఆయన ప్రాతినిధ్యం వహించే కుప్పానికి గానీ, సొంత నియోజకవర్గం చంద్రగిరిలో గానీ విద్యాభివృద్ధికి చేసిందేమీ లేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. గతంలో ఓ కార్పొరేట్ విద్యాసంస్థ అధినేతను పక్కన పెట్టుకుని ఆ విద్యాసంస్థలకు రెడ్‌కార్పెట్ వేసిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కింది. వైఎస్సార్ సీపీ పాలనలో స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తున్నారని విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటా విద్యాభివృద్ధికి రూ.వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. గతంలో ఎన్నడూ చూడని రీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ పాలనలో సర్వాంగసుందరంగా తయారయ్యాయి. కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దింది.

గతంలో వాగ్దానాలు మాత్రమే..

ఎన్నికల సమయంలో విద్యాభివృద్ధికి అనేక వాగ్దానాలు ఇచ్చిన టీడీపీ ఆ తర్వాత వాటిని పూర్తిగా తుంగలో తొక్కింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం, అన్ని పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పేవారు. అయితే అవన్నీ క్షేత్రస్థాయిలో ఏమాత్రం కనిపించని పరిస్థితి. గత పాలనలో సర్కారు బడులను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు కొట్టుమిట్టాడేవి. రేషనలైజేషన్ పేరుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 869 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు.

నాడు నేడు అమలు తీరు ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,816 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆ బడుల్లో 3,30,565 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నాడు–నేడు పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. మొదటి విడతలో 1,533 పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.354 కోట్లను ఖర్చు చేసింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాడు–నేడు రెండో విడత పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆ పనులను ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రెండో విడతలో చిత్తూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన 1,113 పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.129.84 కోట్లను వ్యయం చేసింది. తిరుపతి జిల్లాలో రెండో విడత నాడు–నేడు పథకానికి 982 పాఠశాలలను ఎంపిక చేసి, పనులు చేపడుతున్నారు.

బడుల్లో నాడు–నేడు సౌకర్యాలిలా..

మొదటిదశ నాడు–నేడు పథకంలో ప్రభుత్వం సర్కారు బడుల్లో అనేక సౌకర్యాలను కల్పించింది. రెండో దశలో నిర్వహిస్తున్న పనుల్లో కాంపొనెంట్‌ల వారీగా అనేక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతోంది.

- నిరంతరం నీటి సరఫరాతో మరుగుదొడ్లు
- ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లతో కూడిన విద్యుద్దీకరణ
- శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం
- పిల్లలు,టీచర్లు, తరగతి గదులకు ఫర్నిచర్ ఏర్పాటు
- రంగులు వేయుట, మేజర్, మైనర్ మరమ్మతులు
- గ్రీన్ గ్లోస్సీ చాక్‌బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు
- ప్రహరీ గోడలు, వంట గదుల నిర్మాణం, మరమ్మతులు, తరగతి గదుల నిర్మాణం తదితర సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.



చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో నాడు–నేడులో ఏర్పాటు చేసిన డెస్కులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	2,478
చదువుతున్న విద్యార్థులు	1,63,901
తిరుపతి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	2,338
చదువుతున్న విద్యార్థులు	1,66,664
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటిదశలో పనులు పూర్తి చేసిన పాఠశాలలు	1,533
చిత్తూరు జిల్లాలో రెండో విడతలో పనులు చేస్తున్న పాఠశాలలు	1,183
తిరుపతి జిల్లాలో రెండో విడత నాడు పనులు చేస్తున్న పాఠశాలలు	982

నిత్యం పర్యవేక్షణ



జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నాడు–నేడు పనుల పురోగతిని నిత్యం పర్యవేక్షిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఇటీవల పలు పాఠశాలలను సందర్శించాను. ప్రభుత్వం నాడు–నేడు పనులను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. పనుల పురోగతిలో వెనుకబడిన చోట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆదేశించడం జరిగింది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేయాలి. పలు చోట్ల అధికారులు అలసత్వం వీడి పనులను పకడ్బందీగా చేపట్టాలి. ఎంఈఓలు నిత్యం నాడు–నేడు పనులను పర్యవేక్షించాలి.

– షణ్మోహన్, కలెక్టర్

నాణ్యతగా నాడు-నేడు పనులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు పనులను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. నాణ్యతతో నాడు–నేడు రెండో దశ పనులు చేపట్టడం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాడు–నేడు పనులు పూర్తి చేసేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– వెంకటరమణారెడ్డి, సమగ్రశిక్ష, ఏపీసీ

పురాతన ఆలయాలకు పునర్జీవం

- రూ.18 కోట్లతో ఆలయాల అభివృద్ధి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: నియోజకవర్గంలోని పురాతన ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం పునర్జీవం పోస్తోందని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఎస్సార్‌పురం మండలంలోని శ్రీఆరిమానిగంగమ్మ ఆలయ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.18 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఆలత్తూరులోని వరద వేంకటేశ్వరస్వామి ఆలయం, కనికిరి కొండ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలను టీటీడీలో విలీనం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వినతులు పెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం నియోజకవర్గంలో సుమారు 27 ఆలయాల నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు చేసి పురాతన ఆలయాలకు పునర్జీవం పోసినట్లు తెలిపారు. కనికిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, కార్వేటినగరం మండలం ఆలత్తూరులోని శ్రీవరద వేంకటేశ్వరస్వామి ఆలయాలను టీటీడీలో విలీనం చేయడమే కాకుండా రూ.4 కోట్లు వెచ్చించి పునర్నిర్మాణ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. కార్వేటినగరం స్కంధ పుష్కరిణీలో నిరాలి మండపం నిర్మాణానికి రూ.1.50 లక్షలు, కొటార్వేడులో శ్రీఅగస్త్రీశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు, పాలసముద్రం మండలంలోని శ్రీగోవర్ధనాదీశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1,85 కోట్లు, శ్రీరంగరాజపురం మండలం శ్రీఆరిమానిగంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.1,90 కోట్లు, గంగాధరనెల్లూరు మండలంలోని శ్రీకనుగొండరాయస్వామి ఆలయానికి రూ.1.50 కోట్లు, శ్రీకుప్పమ్మదేవత ఆలయ అభివృద్ధికి రూ.1.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవదాయశాఖ ద్వారా రూ.కోటి ఎనభై లక్షలతో 18 గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు రమణ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, నాయకులు జనార్దన్, పద్మనాభశెట్టి తదితరులు పాల్గొన్నారు.



అరిమానుగంగమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

పోలీస్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిని నివారిద్దాం

జిల్లాలో కుష్టు వ్యాధి నమోదు కేసులు కలవరపెడుతున్నాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా చాపకింద నీరులా వ్యాధి వ్యాప్తిచెందుతోంది. గతంలో చేసిన సర్వేల్లో పలు కేసులు నమోదయ్యాయి. వాటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సోమవారం నుంచి జూలై 16వ తేదీ వరకు ఇంటింటి సర్వేను నిర్వహించనుంది. ఇందు కోసం ప్రత్యేక వైద్య బృందాలను నియమించారు.

- నేటి నుంచి ఇంటింటి సర్వే
- జిల్లా ఆస్పత్రుల పరిధిలో 73 కేసులు
- అవగాహన లేకనే..
- ప్రారంభంలో గుర్తిస్తే వ్యాధి నివారణ
- రూ.20 వేల వరకు ప్రభుత్వాస్పత్రుల్లో మందులు ఉచితం

చిత్తూరు రూరల్: జిల్లాలో సోమవారం నుంచి కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే ప్రారంభం కానుంది. ఇందుకుగాను 1,555 మంది ఆశావర్కర్లు, 1,123 మంది ఏఎన్ఎంలు, 14 మంది సూపర్ వైజర్లను బృందాలుగా నియమించారు. వీరితో పాటు జిల్లా స్థాయి స్థాయి అధికారులు సర్వే పనితీరును పర్యవేక్షించనున్నారు. జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 14 అర్బన్‌హెల్త్ సెంటర్లల్లో పరిధిలో ప్రస్తుతం 73 కుష్టు వ్యాధి కేసులున్నాయి. ఈ కేసుల్లో పాసీబ్యాసిల్లరీ(పీబీ) కేసులు 20 కాగా, మల్టీ బ్యాసిల్లరీ(ఎంబీ) కేసులు 53 ఉన్నాయి. వీరికి ప్రభుత్వం నిత్యం వైద్య పరీక్షలు చేస్తూ మందులు, మాత్రలు పంపిణీ చేస్తోంది. చాలా మందికి వ్యాధిపై అవగాహన లేక పోవడం వల్ల తీవ్రత పెరిగి అంగ వైకల్యంవచ్చే వరకు గుర్తించలేక పోతున్నట్లు సిబ్బంది గుర్తించారు. కొంతమంది శరీరంపై మచ్చలు ఉన్నా తేలికగా తీసుకుంటున్నట్లు నిర్ధారించారు.

వ్యాప్తి ఇలా..

కుష్టు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు సోకుతుంది. కుష్టు వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి వ్యాధిసోకే అవకాశం ఉంది.



కుష్టు వ్యాధి సర్వేలో వైద్య బృందం



శిక్షణలో ఆశావర్కర్లు

ఇవీ లక్షణాలు..

- శరీరంలో చిన్నవి లేదా పెద్ద మచ్చలు పాలిపోయిన రాగి లేదా ఎరుపు రంగులో ఉంటాయి.
- ఆ మచ్చలపై స్పర్శ జ్ఞానం ఉండదు. నొప్పి తెలియదు. చెమట పట్టదు
- వెంట్రుకలు కూడా రాలి పోతాయి
- చర్మంపై బుడిపెలు ఏర్పడతాయి
- చెవి తమ్మెలు, ముఖం, చేతులు కాళ్లపై బుడిపెలు ఏర్పడతాయి
- కాళ్లు, చేతులు, పాదాలు నిస్సత్తువగా ఉంటాయి
- పాదాల్లో గాయాలు ఏర్పడతాయి
- కనురెప్ప పూర్తిగా మూయలేరు

చికిత్స ఇలా...

- ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీ(పీబీ)గా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది.
- ఐదు మచ్చలు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీ(ఎంబీ)గా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 15 నెలల్లో కోర్సును పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.
- దాదాపు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ఖర్చయ్యే మందులను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తారు.
- 6 నెలలు నుంచి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

జిల్లాలో కుష్టు వ్యాధి కేసుల వివరాలు


సంవత్సరం	కేసులు
2018–19	84
2019–20	127
2020–21	62
2021–22	50
2022–2023	67

సర్వే విషయంలో నిర్లక్ష్యం వద్దు

గతంలో చేసిన కుష్టు వ్యాధి సర్వేలో చాలా మంది నిర్లక్ష్యం వ్యవహరించినట్లు తేలింది. అందరూ బాధ్యతగా వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానిత వ్యక్తులను గుర్తించాలి. వారికి వైద్య పరీక్షలు చేయించి ఓనిర్ధారణకు రావాలి. సర్వేను విధిగా చేయాలి. లేనిపక్షంలో చర్యలు ఉంటాయి. కుష్టువ్యాధి వ్యాప్తి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. – వెంకటప్రసాద్, జిల్లా కుష్టు, క్షయ నివారణ అధికారి

కాణిపాకంలో వైభవంగా భాను సప్తమి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం వైవస్వత భాను సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో కూడా శ్రీసూర్య భగవానునికి అర్చక,వేద పండితులు పంచామృత అభిషేక పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదికలో శ్రీసూర్య ఆరాధన తృచ విధానంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు సూర్య నమస్కారాలు చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు



సూర్య నమస్కారాలు చేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

రాగులొచ్చాయి..!

- జిల్లాకు 530 టన్నుల కేటాయింపు
- వచ్చే నెల నుంచి పంపిణీ
- ఉచితంగా ఇంటి వద్దకే..
- కార్డుకు మూడు కేజీలు

చిత్తూరు రూరల్: జిల్లాకు రాగులొచ్చాయి. 5.30 లక్షల కార్డులకు గాను ఇప్పటి 500 టన్నులు ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుకున్నాయి. ఆదివారం నుంచి రేషన్ షాపులకు రాగులను సరఫరా చేస్తున్నారు. వచ్చేనెల నుంచి కార్డుదారులకు ఇంటి వద్దే బియ్యం , చక్కెర, కందిపప్పుతో పాటు రాగులు ఇవ్వనున్నారు. అది కూడా ఉచితంగానే అందించనున్నారు. ఒక కార్డుకు మూడు కిలోల వరకు ఇచ్చేలా కసరత్తు చేశారు. ఎన్ని కిలోల వరకు రాగులు తీసుకుంటే అన్ని కిలోల వరకు బియ్యంలో తగ్గించుకుంటారని అధికారులు చెబుతున్నారు. నాణ్యతాపరంగా బాగున్నాయని వారు అంటున్నారు.

పోషణ అధికం..

ప్రజల్లో పౌష్టికాహార లోపాలు, వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికంగా మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో ఈలోపాలతో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టిక లోపం ఉన్నవారిని గుర్తించి తగిన వైద్య సేవలను అందిస్తోంది. చిరుధాన్యాల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌బాబు తెలిపారు. రాగుల్లో అత్యధిక పోషకాలు కలిగి ఉంటాయన్నారు. రాగుల్లో ఫాస్పరస్, ఐరన్, ఫైబర్, క్యాల్షియం, జింక్ అధికంగా ఉంటుందని తెలిపారు. వీటి వినియోగంతో మధుమేహవ్యాధిని నియంత్రించవచ్చన్నారు. ఎముకల దృఢత్వం పెరుగుతుందని, గుండె పనితీరు మెరుగవుతుందని, జీర్ణక్రియ ఉన్నతస్థితికి చేరుతుందని వివరించారు. శరీరంలో వేడిని కూడా తగ్గిస్తుందన్నారు.



చిత్తూరు పాయింట్‌లో రేషన్ దుకాణాల పంపిణీకి సిద్ధం చేస్తున్న రాగుల బస్తాలు

చెస్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర స్థాయి చెస్ పోటీల కరపత్రాలను ఆల్ చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. అసోషియేషన్ ఆధ్వర్యంలో జూలై 2న జిల్లా కేంద్రంలోని న్యూయార్క్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధోసంపత్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ పోటీల్లో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9849313676, 7036738320 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సభ్యులు సునీల్, కిషోర్, దినేష్, మురుగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో వివాహిత ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్రియ (37) అనే వివాహిత ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన ప్రియకు, చిత్తూరుకు చెందిన వినోద్‌కుమార్‌కు దాదాపు పదేళ్ల క్రితం వివాహమైంది. వినోద్ కుమార్ చిత్తూరు నగరంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్థలు రావడంతో చీరతో ఇంట్లోని పైకప్పుకు ఉరేసుకుని ప్రియ ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ బకాసురులపై ఉక్కుపాదం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆక్రమణకు గురికాకుండా కలెక్టర్ సగిలి షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలు, తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. పర్యవేక్షణకు నియమించిన ప్రత్యేక బృందాలు సర్వే నంబర్లతో పాటు వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు -చిత్తూరు కలెక్టరేట్

- ప్రభుత్వ భూముల రక్షణకు ప్రత్యేక ప్రణాళిక
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- ఆయా మండలాల్లో నివేదికలు సేకరణ

ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.


చిత్తూరు మండలం తిమ్మసముద్రం పర్యటనలో నివేదికలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేస్తున్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఆ బృందాలు మండలాల్లో సర్వే నంబర్లతో పాటు వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి. సేకరించే నివేదికలను నిర్ధిత గడువు లోపు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే చిత్తూరు మండల పరిధిలోని పెద్దిశెట్టిపల్లి గ్రామం వద్ద సర్వే నంబర్ 130, తిమ్మసముద్రం వద్ద సర్వే నెంబర్ 89/11ను ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక దృష్టి...



ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలుంటాయి. ప్రభుత్వ భూమి యంత్రాంగం ఆధీనంలోనే ఉండాలి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- షణ్మోహన్, కలెక్టర్

భూ వివరాలు పక్కాగా సేకరిస్తున్నాం



ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను నియమించాం. ఆయా మండలాల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఇటీవల చిత్తూరు మండలంలో పర్యటించి ఆక్రమణలకు గురైన భూములలో హెచ్చరిక బోర్డులను పెట్టించాం.

- శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,450
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72.00

చెరువులో మునిగి విద్యార్థిని మృతి


మృతి చెందిన బాలిక

గంగవరం: ఆదివారం సెలవు రోజు బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లిన విద్యార్థిని ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మృతి చెందిన ఘటన గంగవరం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. కల్లుపల్లెకు చెందిన వెంకటరమణ కుమార్తె లత(14) ఇదే గ్రామం ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తండ్రి దివ్యాంగుడు. తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆదివారం సెల వు దినం కావడంతో బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయింది. నీటిలో కొట్టుమిట్టాడుతున్న బాలికను గమనించిన సమీప పశువుల కాపరులు పెద్దగా కేకలు వేశారు. చుట్టుపక్కల వారు చెరువు వద్దకు చేరుకున్నారు. ఈతగాళ్లు వెంటనే చెరువులో దిగి బాలికను రక్షించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి ఏనుగు సంచారం


ఏనుగుదాడిలో గాయపడిన పాడిఆవు

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లి అటవీ సరిహద్దు పొలాల్లో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఆదివారం మండలంలోని వి.కోట-పలమనేరు జాతీయ రహదారిలో కుమ్మరమడుగు వద్ద రోడ్డు దాటుతుండగా అక్కడి ప్రజలు గమనించారు. వారు గట్టిగా కేకలు పెట్టడంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లి పోయింది. గ్రామ సమీపంలోనే ఒంటరి ఏనుగు సంచరించడంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.అలాగే శనివారం రాత్రి గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన రైతు రఘుపతికి చెందిన పొలాలపై విరుచకుపడి బీన్స్ పంటను తొక్కి నాశనం చేసింది. అంతేగాక పొలం వద్ద కట్టేసిన పాడి ఆవుపై దాడి చేసి తొక్కి కాలు విరిచేసింది. పందిరిని ధ్వంసం చేసింది.

సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతాం


సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రజా సమస్యపై తక్షణం స్పందిస్తూ..ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని ఆరిమాకులపల్లెలో పర్యటించారు. గ్రామంలో తాగు నీటి సమస్య ఉన్నట్లు తెలుసుకుని అప్పటికప్పుడే జెడ్పీ నిధులతో తాగు నీటి బోరు, మోటారు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న చిన్నపాటి సమస్యలను వెంటనే మండల ప్రజాప్రతినిధులకు, సచివాలయ ఉద్యోగులకు తెలపాలన్నారు. సీఎం చొరవతో సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను 24 గంటల్లో పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు రఘుపతి నాయుడు, మంజునాథ్‌గౌడు, జయరాం, సంపంగి రెడ్డి, సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కృష్ణమూర్తి ఫైల్

పెద్దపంజాణి: పుంగనూరు-పలమనేరు జాతీయ రహదారిలోని బసవరాజుకండ్రిగ సమీపంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు. బసరాజుకండ్రిగ గ్రామానికి చెందిన వెంకటేశు కుమారుడు కృష్ణమూర్తి(65) సొంత పనుల నిమిత్తం ఉదయం పంజాణి సత్రంకు నడచి వెళ్తుండగా బసవరాజుకండ్రిగ సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు కట్టమంచిలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. కట్టమంచికి చెందిన కార్తిక్ కుప్పం సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. సోమవారం విధులకు వెళితే, శనివారం ఇంటికి వస్తాడు. ఇంట్లో తల్లి మాత్రమే ఉంటున్నారు. బుధవారం ఆమె బెంగళూరులో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లింది. శనివారం రాత్రి కార్తిక్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి చూస్తే బీరువా పగులగొట్టి ఉన్నారు. అందులోని రూ.7 వేల నగదు, సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమూరులో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

వాకాడు: మండలంలోని తిరుమూరులో ఆదివారం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన టీఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలు మూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చి, టోర్నమెంట్‌లో పాల్గొన్నారన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116 , రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.7116 నగదు అందజేస్తామని చెప్పారు. ఈ టోర్నమెంట్‌ను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పి కృష్ణారెడ్డి, జి రామచంద్రారెడ్డితోపాటు, గ్రామంలోని మరో యువకుడు కుంచం పవన్ సహకారంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై సర్వే


వాటంబేడు కుప్పంలో పులికాట్ తీరం వద్ద అధ్యయన బృందం

తడ: తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు అటవీశాఖకు చెందిన అధ్యయన బృందం ఆదివారం రామాపురం నుంచి వాటంబేడు వరకు సర్వే చేసింది. టూరిజం అధికారి శ్రీనివాసులు, మత్స్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అనుప, కోట ఎఫ్‌డీఓ రెడ్డినాయక్, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలసి సర్వే చేశారు. తీర ప్రాంతాలలో టూరిజం అభివృద్ధి జరిగితే చుట్టు పక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని టూరిజం అధికారి శ్రీనివాస్ తెలిపారు. జాలర్ల కుప్పాల్లో పర్యటించిన ఈ బృందానికి స్థానిక జాలర్ల సంఘాల నాయకులు తడలో కే ఆర్ముగం, వాటంబేడులో బీ వరప్రసాద్ సహకారం అందజేశారు.

అలరించిన భరతనాట్యం


కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుచానూరు(చంద్రగిరి): శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కా ర్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన శ్రీపద్మ కళాక్షేత్ర ఆధ్వర్యంలో కళాకారులు భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, ఏకదంతాయ, ఈశ్వర, శి వతాండవం, గంధం పూయరా, భరతవేదమున, జగడపు జనువుల జాజర, తె లుగుజాతి, యశోద వంటి పాటలకు కళాకారులు ధన్విత, గంగోత్రి, గీతిక, జాహ్నవి, తేజ, లతిక్ సాయి, యమున, రజిత, రాణి, రిషిత, హిమశ్రీ, హర్షిత చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు పట్టంగట్టిన పుత్తూరు 'పిల'గోడు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరాజు, పక్కన రచయిత కృష్ణస్వామిరాజు

పుత్తూరు రూరల్: పుత్తూరు పిల 'గోడు' హాస్య కథల పుస్తకం మాతృ భాషకు పట్టంగట్టిందని, ప్రతి వ్యక్తి తన మాతృ భాషను మరువకూడదని తెలంగాణ రవాణ, ఆర్అండ్‌బీ శాఖ సెక్రెటరీ కేఎస్.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. పుత్తూరుకు చెందిన ప్రముఖ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు రచించిన పుత్తూరు పిల'గోడు' హాస్య కథల పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత మాతృ భాషకు పట్టం కడుతూ హాస్యరసాన్ని కథల రూపంలో అందించడం ఆనందదాయకమన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మాండలికంలో యాభై ఏళ్ల క్రితం జరిగిన సరదా సన్నివేశాలను రచయిత కథలుగా మలచడం పాఠకుల్ని కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. అంతకుముందు రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజును ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌కు చెందిన 'అచ్చంగా తెలుగు ప్రచురణ'ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయితలు పాణ్యం దత్తశర్మ, సినీ నటులు జెన్నీ, సీనియర్ జర్నలిస్టు బి.ప్రసాదరావు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి ఆ స్నేహమానందగీతం


గోల్డన్ జూబ్లీ జరుపుకున్న పూర్వ విద్యార్థులు

పుత్తూరు రూరల్: యాభై ఏళ్ల క్రితం ఒకే చోట చదువుకొన్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కుటుంబ బాధ్యతలు మోసి, ఉద్యోగ విరమణ చెందారు. వారంతా ఆదివారం పుత్తూరులో ఒక్కటయ్యారు. వారి ఆనందానికి అవధుల్లేవు. 1973-76లో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం వేదికగా కలిశారు. గోల్డన్ జూబ్లి పేరిట ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు, చిత్తూరు, పుత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల్లో స్థిరపడిన పలువురు కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటూ మురిసిపోయారు. ప్రస్తుతం జీవితంలో స్థిరపడిన విషయాలను పంచుకొన్నారు. పిల్లలు, కుటుంబ కుశల ప్రశ్నలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రాజును సత్కరించారు. ఆనాటి విద్యార్థులైన నమశ్శివాయరెడ్డి, విజయకుమార్, సోమప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

చేనేతకు పూర్వవైభవం తీసుకొస్తాం


మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవ్‌సిన్హా చౌహాన్, తదితరులు

వెంకటగిరి: చేనేత రంగానికి మరిన్ని ప్రోత్సహకాలు ఇచ్చి, పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కేంద్రమంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్‌లూమ్ రాకతో చేనేత పరిశ్రమకు కష్టకాలం వచ్చిందన్నారు. నిర్దేశించిన చేనేత ఉత్పత్తులను పవర్‌లూమ్‌పై తయారు కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. జరీ, నూలు, వంటి ముడిసరుకులను 90 శాతం సబ్సిడీతో అందించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అనంతరం ఆయన స్థానిక వివేకానంద యువ సైన్యం కోఆర్డినేటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజీ ప్రకృతికుమార్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, నాయకులు శ్రావణకుమార్, వి భాస్కర్, ఈ యోగీశ్వరరావు, గురుప్రసాద్ పాల్గొన్నారు.